www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 22 అక్టోబర్ 2024
5
వైఎస్ఆర్



నేడు ఉద్యోగ మేళా

ప్రజాశక్తి - కడప అర్బన్ : జిల్లాలో వివిధ కంపెనీలలో పనిచేయడానికి ఈనెల 22న ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేముల ప్రభుత్వ ఐటిఐలో ఉదయం 10 గంటలకు శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్, నవభారత ఫర్టిలైజర్స్ మార్కెటింగ్ పోస్టుకు ఇంటర్వ్యూలు ఉంటాయని పేర్కొన్నారు. పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన వారు అర్హులని తెలిపారు. వయస్సు 19 నుంచి 40 సంవత్సరాల మధ్య ఉండాలని పేర్కొన్నారు. అలాగే జమ్మలమడుగులోని న్యాక్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు టాటా క్యాపిటల్ కంపెనీలో లోన్ ఆఫీసర్, బ్రాంచ్ మేనేజర్ పోస్టుకు, అమర రాజ గ్రూప్ కంపెనీలో మిషన్ ఆపరేటర్ పోస్టుకు ఇంటర్వ్యూలు ఉంటాయని తెలిపారు. పదవ తరగతి, ఇంటర్, ఐటిఐ, డిగ్రీ, పీజీ చేసిన వారు అర్హులని పేర్కొన్నారు. వయస్సు 18 నుంచి 35 సంవత్సరాల లోపు ఉండాలని తెలిపారు.

ప్రేమోన్మాదిని కఠినంగా శిక్షించాలి



భగత్‌సింగ్ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - బద్వేలు

ప్రేమోన్మాది విఘ్నేష్‌ను కఠినంగా శిక్షించి, విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం బాలిక కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్‌టిసి బస్టాండ్ దగ్గర ఉన్న భగత్‌సింగ్ విగ్రహం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి, డివైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో మహిళలపై నిత్యం దాడులు, అత్యాచారాలు పెరిగి పోతున్నాయని అన్నారు. వీటిని అరికట్టడంలో పాలక ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని అన్నారు. దేశంలో బలమైన చట్టాలు లేకపోవడంతో అనునిత్యం మహిళలు, విద్యార్థినుల పై అనేక రూపాలలో దాడులు పెరేగి పోతున్నాయని అన్నారు. గతంలో నిర్భయ లాంటి చట్టాలు ఉన్నా అవి కాగితాలకే పరిమితం అవుతున్నాయని అన్నారు. బద్వేలులో జరిగిన సంఘటన సభ్య సమాజం సిగ్గు పడేలా ఉందని వాపోయారు. బాధితురాలు కుటుంబానికి రూ. 50 లక్షలు ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని, ఇంట్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, ప్రేమోన్మాది విఘ్నేష్‌ను కఠినంగా శిక్షించాలని వారి డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లావ్యాప్తంగా ఆందోళన పోరాటాలు చేపడతామని వారు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ సభ్యులు భాను ప్రకాష్, డివైఎఫ్‌ఐ బద్వేల్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.కె. మస్తాన్, షరీఫ్, ఎస్.కె. ఆలీఫ్, బద్వేల్ రూరల్ కార్యదర్శి యు. బాల గురవయ్య, పట్టణ ఉపాధ్యక్షులు సురేష్, రాజు పాల్గొన్నారు.

ప్రభుత్వం మొద్దునిద్ర నుంచి మేల్కోవాలి : ఎంపి అవినాష్‌రెడ్డి

బద్వేల్‌లో ప్రేమోన్మాది చేతిలో హత్యకు గురైన విద్యార్థిని కుటుంబ సభ్యులను కడప ఎంపి వై.ఎస్. అవినాష్ రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ, ఎమ్మెల్సీ డి.సి గోవిందరెడ్డి పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆడ పిల్లలున్న ప్రతి తల్లిదండ్రులు భయపడుతూ బాధపడుతున్నారని, మాటల్లో చెప్పలేని అమానుషమైన సంఘటన ఇదని పేర్కొన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్ర నుంచి మేల్కొవాలని సూచించారు. దిశ చట్టం, యాప్ అమలు చేసి ఉంటే పోలీసులు పది నిమిషాల్లో స్పాట్ కి వెళ్ళేవారని, రాష్ట్రంలో మహిళలపై ఇంత దారుణాలు జరుగుతుంటే మహిళా హోమ్ మంత్రి ఏమి చేస్తున్నారని సూటిగా ప్రశ్నించారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామని అన్నారు.

బాలిక కుటుంబానికి అండగా ఉంటాం : కడప ఎమ్మెల్యే

కిరాతకంగా చంపబడిన బాలిక కుటుంబానికి ప్రభుత్వం, తాము అండగా ఉంటామని కడప ఎమ్మెల్యే మాధవి పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసులరెడ్డి, బద్వేల్ టిడిపి సమన్వయ కర్త రితీష్‌రెడ్డితో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలిక కుటుంబానికి జరిగిన అన్యాయం ఎవరూ పూడ్చలేనిదని, బాలిక కుటుంబానికి ప్రభుత్వం ద్వారా చేయదగిన సహాయం అందజేస్తామని భరోసా ఇచ్చారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రాగిమాను ప్రతాప్, జయరాం రెడ్డి, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పోలీసుల సేవలు అజరామరం

- జిల్లా అదనపు జడ్జి షేక్ ఇంతియాజ్



అమరవీరుల స్థూపానికి నివాళులర్పిస్తున్న జడ్జి, ఇన్‌ఛార్జి కలెక్టర్, ఎస్‌పి

ప్రజాశక్తి- కడప అర్బన్

శాంతిభద్రతల పరిరక్షణలో నిరంతరం విధుల్లో ఉండే పోలీసు అధికారులు, సిబ్బంది సేవలు వెలకట్టలేనివని 6వ జిల్లా అదనపు న్యాయమూర్తి షేక్ ఇంతియాజ్ అహ్మద్ కొనియాడారు. సమాజానికి వెన్నెముక లాంటి పోలీసులు లేకపోతే అరాచక శక్తులు విజృంభిస్తాయన్నారు. ప్రజల ధన, మాన,ప్రాణాలను రక్షించే క్రమంలో ప్రాణాలు సైతం అర్పించారని, ప్రాణ త్యాగం చేసిన అమరులైన పోలీసులకు నివాళి అర్పిస్తున్నామని తెలిపారు. సోమవారం నగరంలోని పోలీసు పెరేడ్ మైదానంలో అమరవీరుల స్థూపానికి నివాళులర్పిం చారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితి సింగ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య పాలనా వ్యవస్థలో పోలీసుల పాత్ర అత్యంత కీలకమైందన్నారు. సమాజంలో ప్రజల మాన, ప్రాణ, ధన ఆస్తులను కాపాడుతూ శాంతి భద్రతలను పరిరక్షిస్తూ, తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి ప్రజల కోసం, రాష్ట్రం కోసం, దేశం కోసం శ్రమిస్తున్నారని కొనియాడారు. ఎస్‌పి వి.హర్షవర్ధన్ రాజు మాట్లా డుతూ 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిం చుకుంటున్నామని, 1959, అక్టోబర్ 21న లడఖ్‌లో హాట్ స్ప్రింగ్స్ వద్ద పది మంది సిఆర్‌పిఎఫ్ జవానులను అక్రమంగా భారత దేశ భూభాగంలోకి వచ్చిన చైనా దేశపు దళాలు బలిగొన్నాయని తెలిపారు. అమర వీరులైన వారి ప్రాణ త్యాగాన్ని స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 21 న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంగా జరుపుకుంటున్నామని వివరించారు. జిల్లాలో 17 మంది సిబ్బంది వివిధ కారణాలతో ప్రాణాలు కోల్పోవడం బాధాక రమన్నారు. పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం లో భాగంగా పెరేడ్ గ్రౌండ్ లో జిల్లా పోలీసు శాఖ చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలు, సాధించిన విజయాలకు సంబంధించిన ఛాయా చిత్రాలతో కూడిన ప్రదర్శనను ఏర్పాటు చేశారు.

ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన పోలీసు జాగిలాలు

ప్రదర్శనలో నేర పరిశోధనలో ఉపయోగించే డాగ్ స్క్వాడ్ బృందంలో ఇటీవల నూతనంగా చేరిన జాగిలాలు డయానా, రూబీలతో పాటు లూసీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఎస్‌పి జాగిలాల గురించి వివరించారు. నేర పరిశోధనలో, విఐపి ల రక్షణలో కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్.పి కె.ప్రకాష్ బాబు, ఎఆర్ అదనపు ఎస్‌పి బి.రమణయ్య, ఎఆర్‌డిఎస్‌పి మురళీధర్, కడప డిఎస్‌పి ఏ.వెంకటేశ్వర్లు, పులివెందుల డిఎస్‌పి మురళీనాయక్, మైదుకూరు డిఎస్‌పి రాజేంద్ర ప్రసాద్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ హేమ కుమార్, ఆర్‌ఐలు ఆనంద్, వీరేష్, శ్రీశైల రెడ్డి, శివరాముడు, టైటస్, ఆర్‌ఎస్‌ఐలు, నగరంలోని సిఐ లు, ఎస్‌ఐ లు, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, విధి నిర్వహణలో అమరులైన పోలీసు సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. **సిద్దవటం :** పోలీసు అమరవీరుల త్యాగాలను మరువలేనిదని 11వ బెటాలియన్ ఇన్‌ఛార్జి కమాండెంట్ డి. నాగేశ్వరప్ప తెలిపారు. బెటాలియన్‌లో సోమవారం నిర్వహించిన పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవానికి ఇయన ముఖ్య అతిధిగా విచ్చేసి బెటాలియన్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించి అమరులైన పోలీసు వీరులకు ఘనంగా నివాళులను అర్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు థియోఫిలాస్, ఆర్‌ఐలు అలీబాష, కె.వి.రమణ, సి.ఆర్.కె.రాజు, టి. శ్రీనివాసరావు, గోవిందరాజు, రేంజర్ కళావతి, బెటాలియన్ యూనిట్ ఆసుపత్రి వైద్యాధికారి దివ్యారాణి, ఆర్‌ఎస్‌ఐలు బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు. **ఖాజీపేట :** విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ సిబ్బంది సేవలు మరువలేనివని, వారి త్యాగాలు ప్రశంసనీయమని సిఐ మోహన్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో అమరులైన పోలీసులకు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఐ మోహన్ మాట్లాడుతూ ప్రజల రక్షణయే ద్యేయంగా పోలీస్ శాఖ పనిచేస్తుందని అన్నారు.

అర్జీలను వేగంగా పరిష్కరించాలి

ప్రజాశక్తి - కడప

జిల్లాలోని సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితి సింగ్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక సమావేశ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఇన్‌ఛార్జి కలెక్టర్‌తోపాటు డిఆర్‌ఒ గంగాధర్ గౌడ్, డిఆర్‌డిఎ పీడీ ఆనంద్ నాయక్, ఐసిడిఎస్ పీడీ శ్రీలక్ష్మి, హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. పెండింగ్ బియాండ్ ఎస్‌ఎల్‌ఎ, రీఓపెనింగ్ లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు.కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కొండారెడ్డిని పరామర్శించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కడప అర్బన్



పరామర్శిస్తున్న కడప ఎమ్మెల్యే మాధవి

టిడిపి నగర అధ్యక్షుడు శివకొండారెడ్డిపై గుర్తు తెలియని దుండగులు దాడి చేయడం వల్ల గాయపడి ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, ఐసియులో చికిత్స పొందుతున్నారు. ఆయన్ను సోమవారం కడప ఎమ్మెల్యే మాధవి, పొలిట్ బ్యూరో సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస రెడ్డి పరామర్శించారు. పోలీసు వారు విచారణ చేస్తున్న తరుణంలో నిందితులు ఎవరైనా సరే తప్పకుండా శిక్షపడేలా చేస్తామని హామీ ఇచ్చారు.

డయల్ యువర్ ఆర్‌టిసికి పది ఫిర్యాదులు

ప్రజాశక్తి కడప అర్బన్ : డయల్ యువర్ ఆర్‌టిసి కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి పది ఫిర్యాదులు అందాయని ఆర్ఎం గోపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆర్ఎం కార్యాలయంలో డయల్ యువర్ ఆర్‌టిసి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలు ఏమైనా ఉంటే డయల్ యువర్ ఆర్‌టిసికి కానీ వాట్సాప్‌లో కానీ తెలియజేయవచ్చని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని తెలిపారు.

వాలంటీర్లను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : వాలంటీర్లుగా గ్రామ స్థాయిలో ప్రజలకు కీలకంగా సేవలు చేశామని, సేవలను గుర్తించే టిడిపి మేనిఫెస్టోలో వాలంటీర్లను విధుల్లోకి తీసుకుంటామని హామీ ఇచ్చారని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. ముందుగా మహావీర సర్కిల్ నుంచి కలెక్టోరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతి తక్కువ వేతనంతో ప్రజలకి నిశ్వార్థంతో ప్రజలకు సేవ చేశారని, ప్రజలకి ప్రభుత్వానికి వారధిగా ఉన్నారని తెలిపారు. ఏ పార్టీకి సంబంధం లేని నిరుద్యోగులే వీరంతా అన్నారు. రూ.10 వేల వేతనంతో తిరిగి విధుల్లోకి తీసుకోవాలన్నారు.



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలియజేస్తున్న ఎల్ఐసి ఏజెంట్లు

పాత కమీషన్‌ను కొనసాగించాలి

ప్రజాశక్తి - కడప సిటీ

ఎల్ఐసి పాలసీదారులకు బోనస్ రేట్లు పెంచాలని, ఏజెంట్లకు పాత కమీషన్‌ను కొనసాగించాలని ఎల్ఐసి బ్రాంచ్ కార్యాలయం ఎదుట కడప బ్రాంచ్ అధ్యక్షులు రాజోలు నిత్యానంద రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నల్లబ్యాడ్జీలతో ఏజెంట్లు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా నిత్యానంద రెడ్డి మాట్లాడుతూ పాలసీదారుల వయసు 55 సంవత్సరాల నుంచి 50కి తగ్గడం వల్ల 51 నుండి 55సంవత్సరాల వయసు వారికి పాలసీ లేకుండా పోయిందని తెలిపారు. ఆ పాలసీలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు చంద్రమోహన్ రెడ్డి, గంగిరెడ్డి వీరభద్రుడు, చీర్ల చెన్నయ్య యాదవ్, సుంకర రామచంద్రుడు, కొరివి శీను, గంగాధరయ్య, చంద్రశేఖర్ రెడ్డి, ఆర్ మాధవి రెడ్డి, మల్లికార్జున ,వెంకటేశ్వర్లు, , నరసయ్య, మస్తానయ్య ,రవి. యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

అగ్నివీర్ నియామకాలపై అవగాహన

ప్రజాశక్తి - కడప



ఎయిర్‌ఫోర్స్ కిట్లతో విద్యార్థులు

పదవ తరగతి పాస్ అయిన తర్వాత 17 ఏళ్ల వయస్సు దాటిన వారు ఎవరైనా ఇండియన్ ఆర్మీ ఉద్యోగాలలో, అగ్నిపథ్‌లో చేరవచ్చునని ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అధికారులు సందీప్, సురేంద్ర సింగ్ అన్నారు. జిల్లా యువజన సర్వీసుల శాఖ (స్టెప్) ఆధ్వర్యంలో సోమవారం అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల, ఎస్‌కెఆర్ అండ్ ఎస్‌కెఆర్ ప్రభుత్వ మహిళల డిగ్రీ కళాశాలలో అగ్నివీర్ నియామకాల పై అవగాహనా కార్యక్రమం నిర్వ హించారు. యువతకు ఉద్యోగాలలో ఉన్న అవకాశాల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రతి సంవత్సరం రెండుసార్లు ఇండియన్ ఆర్మీలో ఎంపికలుంటాయని అప్పుడు నమోదు చేసుకొని రాత, మౌఖిక పరీక్షల ద్వారా ఎంపిక చేస్తారని తెలిపారు. తెలిపారు. కార్యక్రమంలో ఇరు కళాశాల నుండి దాదాపు 820 మంది విద్యార్థులతో పాటు అన్నమాచార్య కళాశాల అధ్యాపకులు డాక్టర్ శశి కుమార్, ప్రభుత్వ మహిళల కళాశాల, ప్రిన్సిపల్ డాక్టర్ సలీం బాష, అధ్యాపకులు డాక్టర్ విజయ లక్ష్మి, డాక్టర్ గురివి రెడ్డి, డాక్టర్ గురు మోహన్ రెడ్డి, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి, సురేశ్, నెహ్రూ యువ కేంద్ర, జిల్లా యూత్ ఆఫీసర్ మణికంఠ, స్టెప్, మేనేజర్ వి.వి. సుబ్బారాయుడు, సిబ్బంది యస్. అబ్బాస్ అల్లి పాల్గొన్నారు.

జవాన్‌కు అశ్రునయనాల నడుమ వీడ్కోలు

- ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు
- నివాళి అర్పించిన కడప ఎంపీ



ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్న జవాన్లు

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

చత్తీస్‌గఢ్‌లోని అబూజ్‌మడ్ ప్రాంతంలో మావోయిస్టుల అమర్చిన ఐఇడి పేలి తోట్లపల్లి పంచాయతీలోని పాపిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన కొడవటికంటి రాజేష్ వయస్సు(36) మతి చెందాడు. చత్తీస్‌గడ్ నుంచి ఆదివారం రాత్రి జవాన్ మృతదేహం స్వగ్రామానికి చేరుకుంది. సోమవారం పాపిరెడ్డిపల్లిలో అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించారు. కార్యక్రమానికి ఐటిబిపి డిప్యూటీ కమాండర్ తేజ్‌వీర్‌సింగ్, సుబేదార్ మేజర్ హరివిందర్‌సింగ్ రాథోడ్, ఇన్‌స్పెక్టర్ జిప్ సింగ్, సబ్ ఇన్‌స్పెక్టర్ ఓమ్‌ప్రకాష్‌తోపాటు 16 మంది జవాన్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా జవాన్‌లు గ్రామంలో కవాతు నిర్వహించారు. రాజేష్ మృతదేహం వద్ద మూడు రౌండ్లు గాలిలో కాల్పులు జరిపి పోలీస్ వందనంతో అంత్యక్రియలు నిర్వహించారు. ఐటిబిపి నుంచి జవాన్ కుటుంబానికి రూ.35 లక్షలు వరకు పరిహారం అందనుంది. చత్తీస్‌గఢ్ ప్రభుత్వం రూ.కోటి ప్రకటించింది. జవాన్ మృతదేహానికి కడప ఎంపీ వై.ఎస్.అవినాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ జవాన్ రాజేష్ కుటుంబాన్ని ఆదుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు లేఖ రాశానని చెప్పారు. ప్రభుత్వం నుంచి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా అందించాలని, కుటుంబ పోషణకు జవాన్ సతీమణి స్వాతికి మానవతా దృక్పథంతో ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వాలని లేఖలో పేర్కొనట్లు తెలిపారు. జవాన్‌కు నివాళులర్పించిన వారిలో బద్వేల్ ఆర్‌డిఒ చంద్రమోహన్, మాజీ మంత్రి డి.ఎల్.రవీంద్రారెడ్డి, తహశీల్దార్ దామోదర్‌రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ జాన్సన్, మైదుకూరు డిఎస్‌పి రాజేంద్రప్రసాద్, బి.మఠం ఎస్ఐ చంద్రశేఖర్, టిడిపి, వైసిపి నాయకులు, సర్పంచులు ఉన్నారు.

యుటిఎఫ్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా మాదన విజయ కుమార్, పాలెం మహేష్ బాబు

ప్రజాశక్తి- కడప అర్బన్



విజయ్‌కుమార్, మహేష్

వైఎస్ఆర్ కడప జిల్లా యుటిఎఫ్ నూతన కమిటీని ఆదివారం కడప యుటిఎఫ్ భవన్‌లో నిర్వహించిన జిల్లా స్వర్ణోత్సవ మహాసభలలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షుడిగా ఎన్.నాగార్జున రెడ్డి, జిల్లా అధ్యక్షుడిగా మాదన విజయ కుమార్, సహాధ్యక్షులుగా వై.రవికుమార్, డి.సుజాత రాణి, ప్రధాన కార్యదర్శిగా పాలెం మహేష్ బాబు, ట్రెజరర్ గా కె.నరసింహారావు , కార్యదర్శులుగా చెరుకూరి శ్రీనివాసులు, డి.వి. రవీంద్రుడు, కె.చెన్నయ్య, సి.వి.రమణ, ఎస్.ఏజాస్ అహ్మద్, వి.మురళీకృష్ణ, ఎల్.చంద్ర ఓబుల్ రెడ్డి, ఎ.శ్రీనివాసులు, బి.ప్రసన్న లక్ష్మి, టి.శివ ప్రసాద్, ఈరి బాల జోజి ఎన్నికయ్యారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా పాలెం మహేష్ బాబు, మాదన విజయకుమార్, డి.రూతు ఆరోగ్య మేరీ, ఎస్.ఓబుల్ రెడ్డి, డి.కృష్ణారెడ్డి ఆడిట్ కమిటీ కన్వీనర్ గా ఎం.ప్రభాకర్, ఆడిట్ కమిటీ సభ్యులుగా ఎ.డి. దేవదత్తం, టి.వి.రమణ, జి.రవిశంకర్, ఎస్.ఫయాజుద్దీన్, ఎం.మేరి ప్రసన్న ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలకు యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నవ కోటేశ్వరరావు ఎన్నికల అధికారిగా వ్యవహరించగా, మరో రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీ రాజా పరిశీలకులుగా వ్యవహరించారు. అనంతరం మహాసభలు చేసిన తీర్మానాలను ప్రవేశపెట్టారు.

'మా గ్రామంలో మద్యం దుకాణం వద్దు బాబోయ్'

ప్రజాశక్తి - సిద్ధవటం



ఎక్సైజ్ సిఐకి వినతి పత్రం అందజేస్తున్న మహిళలు

తమ గ్రామంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయొద్దంటూ మండల పరిధిలోని ఉప్పరపల్లి గ్రామ పంచా యతీ సాయి నగర్‌కు చెం దిన మహిళలు అధికా రులను వేడు కుంటున్నారు. సోమవారం వారు సిద్ధ వటం ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్‌కు వినతి పత్రం సమర్పించారు. సాయి నగర్‌లో గృహాల మధ్య మద్యం షాపు ఏర్పాటు చేయడం వల్ల తప్ప తాగి గ్రామాల్లో సమస్యలు వస్తాయని పేర్కొన్నారు. నియమ నిబంధన ప్రకారం ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సిఐ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు సిద్ధవటం మండలంలో 5 మద్యం షాపులున్నాయని ఎండోమెంట్ పరిధిలో ఉన్న గుడికి, పాఠశాలకు100 మీటర్ల పరిధిలో జాతీయ రహదారికి 500 మీటర్ల దూరంలో మద్యం దుకాణం ఉండాలని పేర్కొన్నారు. పల్లె ప్రాంతాల్లో బెల్ట్ షాపులు విక్రయిస్తే కఠినమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఉప్పరపల్లి, సాయి నగర్‌లో మద్యం దుకాణం గృహాల మధ్య ఏర్పాటు చేసినట్లు ఆ ప్రాంత మహిళలు ఫిర్యాదు చేశారని, ప్రభుత్వ నియమ నిబంధనలకు వ్యతిరేకంగా ఉంటే చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు.

ఇన్‌ఛార్జి కలెక్టర్‌ను కలిసిన ఎయిర్ ఫోర్స్ అధికారులు

ప్రజాశక్తి - కడప : జిల్లాకు విచ్చేసిన ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అధికారులు, ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితి సింగ్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా పిజిఆర్‌ఎస్ హాల్‌లో కలిశారు. ఈ సందర్భంగా 'ఇండియన్ ఎయిర్ ఫోర్స్'లో ఉద్యోగ అవకాశాలపై యువతకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు జిల్లాకు విచ్చేసిన అధికారులు నాన్ కమిషన్డ్ ఆఫీసర్స్ ఎన్. సందీప్, సురేంద్ర సింగ్ ఆమెను కలిసి ఇండియన్ ఎయిర్ ఫోర్స్ కిట్ ను అందజేశారు. అనంతరం ఇన్‌ఛార్జి కలెక్టర్ చేతుల మీదుగా పోస్టర్‌ను ఆవిష్కరింపజేశారు. కార్యక్రమంలో ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అధికారులతో పాటు జిల్లా ఉపాధి అధికారి ఎం. సురేష్ కుమార్, నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి శ్రీమణికంఠ, స్టెప్ అధికారులు పాల్గొన్నారు.

సమాచార హక్కుపై అవగాహన అవసరం : ఎఒ

ప్రజాశక్తి. కడప సిటీ



మాట్లాడుతున్న ఎఒ సురేష్‌రెడ్డి

సమాచార హక్కు చట్టం - 2005 పై అవగాహన అవసరమని వ్యవసాయశాఖ ఎఒ సురేష్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం గ్రామస్థాయి అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సమాచార హక్కు చట్టంపై పూర్తిగా అవగాహన కల్పించి వివిధ సెక్షన్లను వివరించారు. దరఖాస్తు చేసుకున్న వ్యక్తులకు 30 రోజుల్లో సమాచారాన్ని పూర్తిస్థాయిలో ఇవ్వాల్సి ఉందని తెలిపారు. ప్రతి కార్యాలయం ఆవరణంలో సమాచార హక్కు బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. సమాచారం పూర్తిస్థాయిలో లేకపోతే సమాచారాధికారిపై జరిమానా, క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. బోర్డులో పౌర సమాచార, సహాయ, అప్పిలేట్ అథారిటీ అధికారుల పేర్లు, హోదా, మొబైల్ నంబర్లు కనిపించే విధంగా ప్రదర్శించాలని తెలియజేశారు. సమాచారం తెలుసుకోవడం ప్రజల హక్కు అని సమాచార హక్కు చట్టం ప్రకారం కోరిన సమాచారం అందు బాటులో లేకుంటే సంబంధిత శాఖల అధికారులకు సదరు దరఖాస్తు బదలాయించవచ్చు అన్నారు. రిజెక్ట్ చేసిన సందర్భాలలో కారణాలు తెలపాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మహిళలు, వృద్ధులకు అధిక ప్రాధాన్యత

ప్రజాశక్తి-కడప అర్బన్ : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఎస్‌పి వి.హర్షవర్ధన్ రాజు పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి ఎస్‌పి నేరుగా ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యలను ముఖాముఖి మాట్లాడి అడిగి తెలుసుకున్నారు. వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదట ప్రాధాన్యతనిస్తూ సత్వరమే సమగ్ర విచారణ జరిపి, వారి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు.

ఉన్నత స్థానాలకు చేరుకోవాలి

ప్రజాశక్తి - కడప : విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ పేర్కొన్నారు. సోమవారం ఆయన కడప నగరంలో ఉన్న సాంఘిక సంక్షేమ హాస్టల్‌లను, చిల్డ్రన్, ఓల్డ్ ఏజ్ హోమ్‌లను సందర్శించారు. క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని పిల్లలకు సూచించారు. పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నంది మండలంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం చింతకొమ్మదిన్నె మండలం ప్రకాశం పల్లెలోని ఆశా నిలయం ప్రత్యేక స్కూల్, బాలురు, బాలికలు, చెన్నూరు మండలం ఉప్పరపల్లిని మెర్సీ హోమ్‌ను సందర్శించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్, కడప, నిర్వాహకులు పాల్గొన్నారు పాల్గొన్నారు.

తేక్వాండో పోటీలకు విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి - కడప సిటీ

స్థానిక బాలాజీ నగర్‌లోని శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో ఇసిఇ విభాగంలో బిటెక్ 4వ సంవత్సరం చదువుతున్న విద్యార్థి టి. రఘు పంజాబ్ రాష్ట్రం అమృత్‌సర్‌లో డిసెంబర్‌లో నిర్వహించే తేక్వాండో పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ డాక్టర్ వీర సుదర్శనరెడ్డి ఒక పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని కళాశాల వైస్ చైర్మన్లు అంబవరం ప్రకాష్, అంబవరం ప్రదీప్, ప్రిన్సిపల్, కళాశాల సిబ్బంది భినందించారు.

చెన్నూరు పోలీసుస్టేషన్‌కు ఎస్ఐ కరువు

- రెండేళ్లుగా పోస్టు ఖాళీ
- పేరుకుపోతున్న కేసులు
- సిబ్బందిపై పనిభారం



ప్రజాశక్తి-చెన్నూరు

చెన్నూరు పోలీస్‌స్టేషన్‌లో రెండేళ్లుగా ఎస్ఐ పోస్టు ఖాళీగానే ఉంది. జిల్లాలోని చింతకొమ్మదిన్నె, చెన్నూరు, ఖాజీపేట పోలీస్ స్టేషన్లు అప్‌గ్రేడ్ అవడంతో సిఐలను నియమించారు. అయితే చింతకొమ్మదిన్నె, ఖాజీపేటలలో ఎస్ఐలను నియమించడం చెన్నూరుకు నియమించలేదు. జిల్లా అధికారులు ఎస్ఐని నియవించాలని మండల వాసులు కోరుతున్నారు. ఎస్ఐని నియమిస్తే చెన్నూరు మండ లం పరిసర ప్రాంతాలను బట్టి దాదాపు 6 కిలోమీటర్ల వరకు కడప - కర్నూల్ జాతీయ రహదారి విస్తరించి ఉండటం వల్ల తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగు తుంటాయి. అలాగే మండల పరిసరాల్లో కొన్ని అసాంఘిక కార్యక్రమాల్లో భాగంగా యువకులు మత్తుకు బానిసై కొట్టుకొని గాయాలు కావటం, జూదం, క్రికెట్ బెట్టింగ్‌లు, గంజాయి, చౌక బియ్యం,ఇసుక అక్రమ రవాణా, వంటి అసాంఘిక చర్యలపై పోలీసులు గట్టిగా నిఘా పెట్టినట్లవుతుంది. దీంతోపాటు ఇటీవల రామనపల్లె, చెన్నూరు పాత బ్యాంకు వీధి, కొత్త రోడ్డుపై వరుసగా దొంగతనాలు జోరుగా జరగడం అందరికీ తెలిసిన విషయమే. కాగా ఇటీవల స్థానిక శివాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్టా మహోత్సవాల్లో భాగంగా గ్రామంలో ఇరువర్గాల మధ్య నెలకొన్న సమస్యల దృష్ట్యా కొన్ని చెదురు మదురు సంఘటనలు చోటు చేసుకోవడం, జిల్లా పోలీసు అధికారులు మోహరించి, స్థానిక అధికారులతో కట్టడి చేయడం కష్ట సాధ్యంగా మారిన విషయం అందరికి తెలిసిందే. ఇటీవల దసరా ఉత్సవాల్లోనూ కొంత మంది యువకులు మధ్య నెలకొన్న ఘర్షణలను పోలీసులు ద్వారా కట్టడి చేయడం కష్టసాధ్యమైంది. చెన్నూరు గ్రామ వీధుల్లో, కొత్త రోడ్డుపై ఆటోలు, బస్సులు, ఇతర వాహనాలు అస్తవ్యస్త నిర్వహణపై పలుమార్లు పోలీస్ అధికారుల దృష్టికి ప్రజలు తీసుకెళ్లడం కూడా జరిగింది. వీటన్నిటితో పాటు స్థానిక పోలీస్ స్టేషన్‌లో భార్యాభర్తల గొడవలు, స్థల వివాదాలు, భూ అక్రమలు, డబ్బు లావాదేవీలు తదితర విషయాలపై ఫిర్యాదులు ఎక్కువగా రావడంతో ఉన్న సిఐపై బరువు బాధ్యతలు పడటం తప్పనిసరి అయింది. చెన్నూర్ పోలీస్ స్టేషన్ అప్‌గ్రేడ్ కాకముందు ఎస్ఐ శ్రీనివాసులు రెడ్డి 2022లో బదిలీపై వెళ్లారు. అప్పట్నుంచి ఇప్పటివరకు ఎస్ఐ నియామకంపై ఎటువంటి చర్యలు లేవు. వీటన్నిటి దృష్ట్యా చెన్నూర్ పోలీస్ స్టేషన్‌కు ఎస్ఐని నియమిస్తే అసాంఘిక కార్యక్రమాల కట్టడితో పాటు శాంతి భద్రతల దృష్ట్యా విధి నిర్వహణ సక్రమంగా జరుగుతుందని, విషయంపై జిల్లా పోలీసు అధికారులు తగువిధంగా స్పందించాలని ప్రజలు కోరుకుంటున్నారు.


సమస్యలు వింటున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ప్రజా సమస్యలపై ప్రత్యేకదృష్టి సారిస్తున్నామని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం తన నివాసంలో ఆయన ప్రజాదర్బార్ నిర్వహించారు. నియోజకవర్గంతోపాటు ఇతర ప్రాంతాల ప్రజలు కూడా ఎమ్మెల్సీని కలిసి వారి సమస్యలను వినతిపత్రాల రూపంలో సమర్పించారు. స్పందించిన ఎమ్మెల్సీ అప్పటికప్పుడే అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి పరిష్కరించాలని కోరారు. వారి వద్దకు వచ్చిన ప్రజా సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. లేనిపక్షంలో అధికారులపై తగిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్సీ హెచ్చరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి దాదాపు రూ.10 లక్షల చెక్కులను బాధిత కుటుంబాలకు శాసనమండలి సభ్యుడు భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి అందజేశారు. సోమవారం నియోజకవర్గానికి చెందిన కాచర్ల రమీజా, చందుల కోటిరెడ్డి, రామిరెడ్డి పురుషోత్తంరెడ్డి, సన శృతిలయ, ఉమ్మినేని గంగి నాయుడు, లింగాల వెంకట రంగారెడ్డి, సౌమ్య కృష్ణయ్య, పందిళ్లపల్లి నిహాల్‌రెడ్డి, కొమ్మ లక్ష్మీదేవి, మేకల జితేంద్రకుమార్ అనారోగ్యానికి గురై వివిధ హాస్పిటల్లో చికిత్స చేయించుకున్నారు. అందరికీ ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి చెక్కులను మంజూరు చేయించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సహాయ నిధి రావడానికి కృషి చేసిన ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.


సబ్సిడీ శనగలు పంపిణీ చేస్తున్న పార్థసారథిరెడ్డి

రైతులకు రాయితీ శనగలు పంపిణీ

ప్రజాశక్తి - వేముల

వేముల వ్యవసాయ కేంద్రం వద్ద సోమవారం రాయితీ శనగలను టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారథిరెడ్డి రైతులకు పంపిణీ చేశారు. సహాయ వ్యవసాయ సంచాలకులు ఎ.ప్రభాకర్‌రెడ్డి, ఎఒ వి.చెన్నారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎడిఎ మాట్లడుతూ రైతులందరూ సబ్సిడీ శనగలను వినియోగించుకోవాలని కోరారు. ఎఒ మాట్లాడుతూ మండలానికి 3,300 క్వింటాళ్ల శనగలు మంజూరైనట్లు తెలిపారు. అనంతరం ఎడిఎ, ఎఒ గొల్లల గూడూరులో విత్తన పంపిణీని పరిశీలించారు. కార్యక్రమంలో ఎన్‌డిఎ కూటమి నాయకులు, వేముల విహెచ్‌ఎ హారిక, ఎంపీఈఒ ఎలీసా, గొల్లల గూడూరు ఎంపీఈఒ నందిని, కొండయ్య పాల్గొన్నారు.

సకాలంలో విత్తనాలు అందజేయాలి

ప్రజాశక్తి - లింగాల

ప్రభుత్వం రైతులకు సబ్సిడీతో అందించే శనగ విత్తనాలు పంపిణీ సకాలంలో చేయాలని పులివెందుల సహాయ వ్యవసాయ సంచాలకులు ఎ.ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు. మండల పరిధిలోని పెద్దకుడాల, బోనాల రైతు సేవ కేంద్రాల్లో సోమవారం జరుగుతున్న శెనగ విత్తన పంపిణీని ఆయన పరిశీలించారు. విత్తనాల కోసం ముందుగా నమోదు చేసుకున్న రైతులకు సబ్సిడీ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎడి మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు 1,128 మంది రైతులకుగానూ 1591.80 క్వింటాళ్ల శనగలకు రైతులు నమోదు చేసుకోగా.. 631 క్వింటాళ్ల విత్తనాలను పంపిణీ చేశామన్నారు. విత్తనాలు తీసుకున్న ప్రతి రైతు కూడా పంట సాగు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎఒ రమేష్, రైతు సేవ కేంద్ర ఇన్‌ఛార్జి మౌనిక, జగదీశ్వర్‌రెడ్డి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

రెండు దుకాణాల్లో చోరీకి యత్నం

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె నాలుగు రోడ్ల కూడలి జడ్పీ కాంప్లెక్స్ వెనుక ఉన్న దుకాణాల్లో జరిగిన చోరీ యత్నం విఫలమైంది. ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు సిఎల్ఆర్ సెల్ పాయింట్ దుకాణంలో, ఆటో స్టాండ్ వీధిలో ఉన్న ఫైన్ సెల్ పాయింట్‌లో చోరీకి యత్నించారు. అయితే దుకాణాలకు ఉన్న షట్టర్ బీగాలు రాకపోవడంతో వెనుదిరిగి వెళ్లినట్లు తెలుస్తోంది. ఫైన్ సెల్ పాయింట్‌లో షెట్టర్ కొద్దిగా ఎత్తి రిపేరుకు వచ్చిన సెల్‌ఫోన్ మాత్రం దొంగలించినట్లు యాజమాని తెలిపారు. రోజూలాగే సెల్ పాయింట్ తెరవ డానికి వచ్చిన దుకాణాల యాజమానులు చోరీ ప్రయత్నం చేసి అవాక్కయ్యారు. వస్తు వులు, డబ్బులు తీసుకెళ్లక పోవడంతో వారు ఊపిరి పీల్చుకున్నారు.

గుంతల మయం.. జివి సత్రం-నాగసానిపల్లె రోడ్డు

ప్రజాశక్తి - మైదుకూరు (చాపాడు)

మైదుకూరు మండల పరిధిలోని జివి సత్రం నుండి నాగసానిపల్లె వరకు వెళ్లే మార్గం పూర్తిగా గుంతల మయంగా మారింది. ముఖ్యంగా లూకాయపల్లె వద్ద సచివాలయం-1 సమీపంలో పెద్దపెద్ద గుంతలు ఏర్పడి ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారింది. వర్షం వస్తే ఈ గుంతలు నీటితో నిండి చిన్న వంకను తలపిస్తాయి. వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు, ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ మార్గాన నిత్యం ప్రజలు, వాహనాలు రాకపోకలను సాగిస్తుంటారు. ద్విచక్ర వాహనదారులు ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ వారంలో తుఫాను ప్రభావంతో నాలుగు రోజులపాటు వర్షం పడడంతో గుంతలన్నీ నీటితో నిండి ఉన్నాయి. కాలినడకన వెళ్లేవారు ఈ గుంతలలోని మురుగు నీటిలో నడవాల్సిన పరిస్థితి. జివి సత్రం నుండి ఈ మార్గాన నాగసానిపల్లెతోపాటు ఖాజీపేటకు అధికంగా నిత్యం ప్రజలు ప్రయాణిస్తుంటారు. సంభంధిత అధికారులు స్పందించి రోడ్డుపై ఏర్పడిన గుంతలను వెంటనే పూడ్పించి, వాహన దారులను ప్రమాదాలకు గురికాకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


సచివాలయం-1 వద్ద వంకను తలపిస్తున్న రోడ్డు

చౌటిపల్లె ప్రజలకు న్యాయం చేయండి


ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, బాధితులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

చౌటిపల్లె గ్రామ ప్రజలకు, బాధితులకు న్యాయం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్, బాధితులు కోరారు. ఆ మేరకు సోమవారం వారు ఆర్‌డిఒ కార్యాలయంలో ఆర్‌డిఒ సాయిశ్రీకి సమస్యలతో కూడిన వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తరతరాల నుండి కరువు కాటకాలతో ఉన్న ప్రాంతం చౌటిపల్లె అన్నారు. ఈ ప్రాంతంలో గండికోట ప్రాజెక్టు కట్టి నీళ్లు ఇస్తే మీ బతుకులు బాగుంటాయి.. మీ పిల్లల భవిష్యత్తు బాగుంటుందని చెప్పడంతో భూములు, సర్వస్వం వారు త్యాగం చేశారన్నారు. కట్టుబట్టలతో పల్లపు ప్రాంతాలకు వచ్చి జీవిస్తున్నారన్నారు. ప్రాజెక్టు పూర్తయి ఇన్ని ఏళ్లయినా ఎలాంటి పరిహారం అందలేదన్నారు. భూమికి బదులు భూమి తమకు ఇస్తామని చెప్పి 2017లో 850 ఎకరాలు ఆర్‌డిఒ సమక్షంలో నాడు అసైన్మెంట్ చేసిన భూములు పంపిణీ చేస్తామని చెప్పారన్నారు. ఆ భూములకు పట్టాలు ఇచ్చి మంచి ఇల్లు నిర్మిస్తామన్నారు. 18ఏళ్లు నిండిన ప్రతి పిల్లవాడికి రూ.6.50లక్షల ప్యాకేజీ ఇస్తామన్నారు. ఇవి నేటికి చౌటిపల్లెలో పరిష్కారం కాలేదన్నారు. 2024లో ఎన్నికల ముందు కూడా ప్రతి కుటుంబానికి రూ.10లక్షలు ఇస్తామని చెప్పి నేటికి ఇవ్వలేదన్నారు. అందుకోసమే అనివార్యమైన పరిస్థితుల్లో తమరికి మరోకసారి విన్నవిస్తున్నామన్నారు. తమ సమస్యలు పరిష్కరించకపోతే హైకోర్టును ఆశ్రయిస్తాని ఆర్‌డిఒతో చెప్పారు.

వీరభద్ర స్వామి ఆవరణలో అన్నదానం

ప్రజాశక్తి - చాపాడు


అన్నం వడ్డిస్తున్న నిర్వాహకులు

అల్లాడుపల్లె దేవళాలు వీరభద్రస్వామి సన్నిధిలోని భద్రకాళి సమేత వీరభద్ర స్వామి అన్నదాన సత్రంలో సోమవారం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. వీరభద్ర స్వామికి ఆలయ అర్చకులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అన్నదాన కార్యక్రమానికి మైదుకూరు పార్వతీనగర్‌కు చెందిన కొండపల్లి వీరభద్రయ్య భాగవతార్, ఆయన సతీమణి సుగుణమ్మ, పెరుగు కృష్ణయ్య యాదవ్ (విలేకరి), ఆయన సతీమణి సరోజమ్మ కుటుంబాల వారు అన్నదానానికి సహకరించారు. కార్యక్రమంలో ఆలయ ఇఒ మారుతి ప్రసాద్, టిడిపి నాయకులు ఎంఎల్ఎన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఎండి పెరుగు నారాయణ యాదవ్, గోసులు వీరారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, వీరారెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీకి 'గౌతమి' విద్యార్థి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జాతీయస్థాయి కబడ్డీ పోటీకి గౌతమి మహిళ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి ఎంపికైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ రామసుబ్బమ్మ తెలిపారు.


హర్షితను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

ప్రొద్దుటూరు మండల పరిధిలోని గౌతమి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో మూడవ సంవత్సరం సిఎస్ఇ విభాగానికి చెందిన కె.హర్షిత జాతీయస్థాయి కబడ్డీ జట్టుకు ఎంపిక కాకడంతో హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు. అనంతరం ప్రిన్సిపల్ మాట్లాడుతూ హర్షిత నవంబర్ 26 నుంచి చెన్నైలోని అళగప్ప యూనివర్శిటీలో జరిగే దక్షిణాది అంతర విశ్వ విద్యాలయాల టోర్నీలో తలపడనున్నారన్నారు. ఎంపికైన హర్షితను కళాశాల కరస్పాండెంట్ బాబమ్మ, డైరెక్టర్లు నాగూరు, రవీంద్రరెడ్డి, కో-డైరెక్టరు శైలూష, వివిధ విభా గాధిపతులు ప్రకాష్‌రావు, మహమ్మద్ జాబీర్, యాకూబ్ అలీ, విజ యమ్మ, ఫిజికల్ డైరెక్టర్ జి.ఓబయ్య, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

ఎస్ఆర్ఐటిలో ప్రాంగణ ఎంపికలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)



స్థానిక సాయి రాజేశ్వరీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాలలో బెంగళూరుకు చెందిన కారిజో ఎడిటెక్ ప్రయివేట్ లిమిటెడ్ వారు సోమవారం బిటెక్ ఫైనలియర్ అన్ని బ్రాంచుల విద్యార్థులు, ఎంబిఎ వారికి ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. బిజినెస్ డెవలప్మెంట్ అసోసియేట్ ఉద్యోగాలకు నిఖిత (ఇఇఇ), సనార్పిన్ (సిఎస్ఇ), ముఖేష్ (సిఎస్ఇ), దివ్యశ్రీ (ఇసిఇ), కౌసర్ నయూమ్, సంధ్య, గైబున్నీసా బేగమ్ (ఎంబిఎ) ఎంపికైనట్లు ప్రిన్సిపల్ డాక్టర్ పాండురంగన్ రవి తెలిపారు. ఎం పికైన వారికి ఏడాదికి రూ.4 లక్షల వేతనం ఇవ్వనున్నట్లు టిపిఒ సునీల్ తెలి పారు. ఉద్యోగాలకు ఎంపికైనవారిని కళాశాల చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీరకుమార్ రెడ్డి, కరస్పాండెంట్ వీర కల్యాణ్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ వెంకటేశ్వరరెడ్డి, హెచ్‌ఒడిలు, అధ్యాపకులు అభినందించారు.

రేపటి నుంచి పశువైద్య కళాశాలలో జాతీయ సదస్సులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

స్థానిక పశువైద్య కళాశాలలో ఎస్వీబిఎస్టీ, ఎస్వీవీయు సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 23నుంచి మూడు రోజులపాటు జాతీయ సదస్సులు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ రాజకిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ దేశాలు, రాష్ట్రాల నుంచి వందల సంఖ్యలో శాస్త్రవేత్తలు పాల్గొంటారన్నారు. పశువైద్య కళాశాలలు నిర్వహించే మొట్ట మొదటి జాతీయ సదస్సులకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. ఇందులో పశువైద్య రంగానికి సంబందించిన పశువుల ఆరోగ్యం, వాటికి సంబంధించిన జబ్బులు, కాళ్ల జబ్బులు, పశువుల ప్రత్యుత్పత్తి తదితర అంశాలపై చర్చిస్తారన్నారు. సమస్యలు వాటి నివారణ, పశు యాజమాన్యం ప్రాముఖ్యత, బయోటెక్నాలజీ, పెంపుడు జంతువులు, చేపలు, ఆటవీ జాతి జంతువుల ఆరోగ్యం అంశాలపై పరిశోధన పత్రాలు, ఫలితాలు చర్చించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పశు వైద్యకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాస ప్రసాద్ సూచనలిస్తారన్నారు.

మందుబాబుల చేష్టలతో ఇబ్బందులు

ప్రజాశక్తి - ఖాజీపేట

పట్టణంలోని మద్యం దుకాణాల సమీప ప్రాంతాల్లో మద్యం సేవించి వారు చేస్తున్న హల్‌చల్‌తో సామాన్య ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రయివేట్ మద్యం దుకాణదారులు మద్యాన్ని మాత్రమే అమ్మాలి. మద్యం దుకాణం వద్ద తాగేందుకు అనుమతి లేదు. మద్యం బాబులు పరిసర దుకాణాలకు వెళ్లి అక్కడే మద్యం సేవించి ప్రధాన రోడ్లపై నానా చేష్టలు చేస్తున్నారు. మందుబాబుల చేష్టల వల్ల పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, మహిళలు తీవ్ర సౌకర్యానికి గురవుతున్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వాళ్లను అరికట్టాల్సిన సంబంధిత అధికారులు ఏమాత్రం పట్టించు కోకపోవ డంలేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధి కారులు స్పందించి బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించకుండా, మందుబాబుల ఆగడాలను అరికట్టాలని కోరుతున్నారు. మద్యం దుకాణాలను జనావాసాలకు దూరంగా తరలించాలని అధికారులకు వినతి పత్రం ద్వారా విన్నవించినా ఏమాత్రం పట్టించుకోవడంలేదని ప్రజల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ముళ్ల పొదలు తొలగించాలని విన్నపం

ప్రజాశక్తి - లింగాల

నెలలు తరబడి ముళ్ల పొదలు పెరిగి విష పురుగులకు నిలయంగా మారాయని, వాటిని తొలగించాలని ది ఫౌండేషన్ ఆఫ్ లైట్ ఆఫ్ రైట్స్ సంస్థ సభ్యులు కోరారు. ఆ మేరకు సోమవారం ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి, లింగాల పంచాయతీ సెక్రటరీ జ్యోతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు రమేష్ మాట్లాడుతూ లింగాల దళితవాడలో 4 నెలలుగా ముళ్ల పొదలు పెరిగి రహదారులకు ఇరువైపులా ఉన్నా యన్నారు. విషపురుగుల సంచరిస్తూ ఇళ్లల్లోకి వస్తున్నాయని, ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని వివరించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు చిన్న పుల్లయ్య, రామకృష్ణ పాల్గొన్నారు


ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

రోడ్లను నాణ్యతతో సకాలంలో నిర్మించాలి

ప్రజాశక్తి - చాపాడు

ఉపాధి హామీ చట్టం నిధులతో మండలంలో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్లను సకాలంలో నాణ్యతతో పూర్తి చేయాలని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ రామాజనుజం తెలిపారు. మండల పరిధిలోని 22 గ్రామ పంచాయతీలో రూ.1.79 కోట్ల నిధులతో రోడ్లు చేపడుతున్నామన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సభా భవనంలో సోమవారం ఆయన సిమెంట్ రోడ్లను నిర్మించే కాంట్రాక్టర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ చివరికి సిమెంట్ రోడ్లను పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా రోడ్లను నాణ్యతాప్రమాణాలతో నిర్మించాలన్నారు. ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి మాట్లాడుతూ సిమెంట్ రోడ్లు పూర్తికాగానే క్వాలిటీ కంట్రోల్ వారు పరీక్షలు నిర్వహిస్తారని, అందుకు అనుగుణంగా రోడ్లు ఏర్పాటు చేయాల న్నారు. నిబంధనలు పాటిస్తూ రోడ్లు పూర్తి చేయాలన్నారు. డ్రెయినేజీ సమస్యలు రాకుండా రోడ్డు నిర్మించాలన్నారు. సిమెంట్ రోడ్లు నిర్మిం చేందుకు ఇసుక కొరత ఏర్పడుతున్నాయని కాంట్రాక్టర్లు తెలిపారు. ప్రభు త్వం ఏర్పాటు చేసిన క్వారీల నుంచి ఇసుకను సరఫరా చేసుకోవాలని ఉపాధి ఏపీఓ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. సమావేశంలో పంచాయతీరాజ్ సిబ్బంది, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇఒపిఆర్‌డి రాధాకృష్ణవేణి


ఎంపీకి సమస్యలు వివరిస్తున్న వైసిపి నాయకులు

సమస్యలు పరిష్కరించాలని ఎంపీకి వినతి

ప్రజాశక్తి - ఖాజీపేట

ఖాజీపేట మండలంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని వైసిపి నాయకులు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఎంపీ మైదుకూరు నియోజకవర్గ పర్యటనలో వారు మాజీ ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డిని కూడా కలిశారు. వైసిపి మండల కన్వీనర్ దుగ్గిరెడ్డి మురళీమోహన్‌రెడ్డి, అగ్రహార సహకార సంఘం మాజీ అధ్యక్షులు పివి రాఘవరెడ్డి ఎంపీకి సమస్యల పరిష్కారానికి వినతి పత్రం సమర్పించారు. ఎంపీ నిధుల ద్వారా సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతామని ఆయన హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.

భూ సర్వేలో లెక్కలేనన్ని తప్పులు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

గత ప్రభుత్వ హయాంలో నిర్వహించిన జగనన్న భూ సురక్ష సర్వేలో తప్పులు దొర్లడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సర్వే సమయంలో తప్పులు దొర్లడంతో రెవెన్యూ కార్యాలయం చుట్టూ భూ సర్వే జరిగిన గ్రామాల రైతులు తిరిగి అర్జీలను సమర్పించారు. మండలంలోని 27 గ్రామాల్లో ఆరు గ్రామాల్లో మాత్రమే భూ సర్వే నిర్వహించారు. ముఖ్యంగా భూమి సరిహద్దులు, విస్తీర్ణం, ముటేషన్, డివిజన్, పేర్లు, సర్వే నెంబర్లు ఇలా కుప్పలు తిప్పలుగా తప్పులు వచ్చాయి. దీంతో రైతులు తమ సమస్యలు పరి ష్కరించాలంటూ అధికారులకు అనేకమార్లు విన్నవించుకున్నా ప్రయోజనం లేదు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే భూ సర్వే సమస్యల పరి ష్కారానికి శ్రీకారం చుట్టింది. గ్రామసభల్లో దొర్లిన తప్పులను పరిష్కరిం చనున్నారు.

నేటి నుంచి గ్రామసభలు..

మండలంలో మంగళవారం నుంచి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ నాగేశ్వరరావు తెలిపారు. ఆ మేరకు ఆయన సోమవారం మాట్లాడుతూ ఆరు గ్రామాల్లో సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు 22న దేవతాపురం, 23న తెలికి, 24న హిమకుంట్ల, 25న జంగంరెడ్డిపల్లె, 26న సింహాద్రిపురం, 29న నిడివెలగలలో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

భూ సమస్యలను సభ దృష్టికి తేవాలి

లింగాల : మండలంలో మంగళవారం నుంచి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహశీల్దారు ఈశ్వరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో ఈనెల 22న నరసింగరావుపల్లెకు సంబంధించి ఎంపిపి స్కూలు అక్కులగారిపల్లె, 23న హిరోజీపురం రామాలయం, 24 రామన్నూతల పల్లె గ్రామ చావిడిలో సభలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భూ సమస్యలను రైతులు సభ దృష్టికి తెస్తే పరిష్కరిస్మాన్నారు. డిప్యూటీ తహశీల్దారు, రీ సర్వే మం డల సర్వేయర్లు, మండల సర్వేయర్లు సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్లు ఆయా గ్రామసభలో పాల్గొంటారని తహశీల్దార్ తెలిపారు.

మహిళలను మోసం చేసిన కూటమి ప్రభుత్వం

- పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్రంలోని మహిళలను టిడిపి, జనసేన, బిజెపి నమ్మించి, మోసగించి అధికారంలోకి వచ్చాయని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ఎన్నికల్లో కూటమి అధికారంలోకి వచ్చేదానికి మహిళల ఓట్లు ప్రధాన కారణమని చెప్పారు. కూటమి పార్టీలు ప్రధానంగా మహిళలకు 3 హామీలు ఇచ్చాయని, వాటిని నమ్మి మహిళలు ఓట్లు వేశారన్నారు.

రాష్ట్రంలో మహిళలకు భద్రత కరువైంది

- పులివెందుల నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌ఛార్జి ధ్రువకుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ఇంటర్ విద్యార్థిని దస్తగిరమ్మను ప్రేమ పేరుతో వేధించి శనివారం పెట్రోల్ పోసి కాల్చిన విగ్నేష్‌ను నడిరోడ్డులో ప్రజలు చూస్తుండగా ఎన్‌కౌంటర్ చేయాలని పులివెందుల కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ధ్రువకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో ఆడబిడ్డలపై జరగుతున్న అత్యాచారాలు ప్రభుత్వానికి కనిపించలేదాని ప్రశ్నించారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, హోంమంత్రి ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వేముల మండలశాఖ అధ్యక్షుడు మాబు, సింహాద్రిపురం మండల నాయకులు శివ, పులివెందుల టౌన్ అధ్యక్షుడు రమేష్ పాల్గొన్నారు.



అవార్డును అందుకుంటున్న భాస్కర్‌రెడ్డి

పత్తి భాస్కర్‌రెడ్డికి అబ్దుల్ కలాం అవార్డు

ప్రజాశక్తి - ఖాజీపేట

స్థానిక సుంకేసుల రోడ్డులోని శ్రీ సాయి విద్యామందిర్ హైస్కూల్ కరస్పాండెంట్ పత్తి విజయభాస్కర్‌రెడ్డి డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం జాతీయ ప్రతిభ అవార్డును అందుకున్నారు. ఆదివారం గుంటూరులోని ఎసి కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో ప్రముఖులచే అవార్డు అందుకున్నారు. కొన్నేళ్లుగా విద్యాభివృద్ధికి అందిస్తున్న సేవలు గుర్తించి అవార్డును అందజేశారన్నారు. అవార్డు అందుకోవడం చాలా సంతోషంగా ఉం దని, మరింత స్ఫూర్తిగా విద్యాభివృద్ధికి సేవలు అందిస్తానని భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

ప్రజాశక్తి - లింగాల

వివిధ రకాల అభివృద్ధి పనులకు ప్రభుత్వం శ్రీకారం చుటిందని ఎంపిడిఒ కార్యాలయ సూపరింటెండెంట్ లోకేష్ తెలిపారు. మండల పరిధిలోని అక్కులగారిపల్లెలో సోమవారం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మీని గోకులానికి భూమిపూజ చేశారు. రూ.2 లక్షల 30 వేలు నిధులు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎపిఒ గంగరాజు, రైతు శివశంకర్‌రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ శివమూర్తి, సురేంద్రారెడ్డి, శ్రావణి, ఫీల్డ్ అసిస్టెంట్ అంజనాదేవి పాల్గొన్నారు

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

తమ పరిస రాలను శుభ్రంగా ఉంచు కోవాలని తహశీల్దార్ నాగేశ్వరరావు ప్రజలకు సూచిం చారు. సింహాద్రి పురం రెవెన్యూ కార్యాలయ ఆవరణలో సోమవారం పిచ్చి మొక్కలు, గడ్డి, చెత్తాచె దారాన్ని తొల గించారు. ఈ సం దర్భంగా తహశీ ల్దార్ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి తాము పనిచేసే కార్యాలయంతోపాటు తమ ఇంటి పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచు కోవాలన్నారు. కార్యక్రమంలో డిటి హరిబాబు, మండలంలోని వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

వేంపల్లె : పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యం అయ్యేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని మానవత సేవా సంస్థ చైర్మన్ చక్రపాణిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం నెహ్రూ యువ కేంద్రం, మానవత సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో అమ్మ పేరు మీద ఒక మొక్క నాటుదాం అనే కార్యక్రమంలో భాగంగా వేంపల్లెలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక బాధ్యత కోసం ముందుకు వచ్చి గ్రామాల్లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని కోరారు. అధిక సంఖ్యలో మొక్కలు నరికి వేయడంతో పర్యావరణం కొరవడిందని తెలిపారు. విపరీతమైన కాలుష్యం పెరిగిపోయిందన్నారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర సమన్వయకర్త సుబ్బయ్య, చైతన్య స్కూల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.